# గ్రామ పెద్ద

ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరంలో దాగుడుమూతలు ఆడుతున్న ఒక జిల్లాయే రంగారెడ్డి జిల్లా. ఆ జిల్లాలో సంపత్ సమృద్ధితో అలరారుతున్న ఒక మారుమూల గ్రామం, కళ్యానగిరి. ఆ గ్రామస్థుల సుఖమయ జీవిత రహస్యం - సంఘీభావం, క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే తత్త్వం, ఇతర గ్రామాల్లో ఉన్న కొట్లాటలు, కక్షలూ - కావేషాలు ఈ గ్రామంలో మచ్చుకైనా కనబడవు. దోపిడీలు, దొంగతనాలు, మానభంగాలు ఈ గ్రామంలో చాల అరుదు. దానికి కారణమేమిటని ఆలోచిస్తే అర్థమైంది ఈ ఊళ్లో పోలీస్‌స్టేషన్ లేదని. ఆ ప్రాంతపు పోలీస్‌స్టేషన్, ఆ ఊరకి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామ ప్రజలు ఏ పనికి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళరు, కాబట్టి, పోలీసువాళ్ళు కూడా ఈ గ్రామం మీద అలిగినట్టుగా ఉంటారు. గ్రామతగాదాలు వాళ్ళల్లో వాళ్ళే పరిష్కరించుకునే వాళ్ళు. ఆ గ్రామపెద్ద సమరేంద్ర ప్రతాపరావు సమయస్ఫూర్తి వలన సమరందాకా రాకుండానే సమస్యలన్నీ సమసిపోతుంటాయి. ఆ గ్రామంలో పంచాయతీ ఉన్నా, లేకపోయినా ఆ ఊరి రచ్చబండ సమరేంద్ర ప్రతాపరావు గారి ఏకసభ్య న్యాయస్థానమే. వారి న్యాయదక్షతపైన ఆ ఊరి ప్రజలందరికీ అచంచలమైన విశ్వాసముండేది. ఆ ఊరిలో అతనే అతిపెద్ద భూకామందు కావడం వలన, ఆ అధికారం లభించిందని, మాత్రం పొరపడవద్దు. ఏదో ఒక కారణాన, ఈ పదవి, ఈ కుటుంబానికి వంశానుగతంగా సంక్రమిస్తునే ఉంది. సమరేంద్ర ప్రతాపరావు గారి తండ్రి, తాత ముత్తాత కూడా వారి కాలంలో ప్రజామోదమైన తీర్మానాలిచ్చేవారట. గ్రామస్థులందరికీ ఆ కుటుంబపైన గౌరవాభిమానాలున్నాయి. పంచాయితీ ఎన్నికలు జరిగేటప్పుడు, ఆ కార్యక్రమం ఆ గ్రామానికి కూడా వర్తిస్తుంది కానీ, ఆ పోటీలో గెలిచినవాళ్ళు, ఓడినవాళ్ళు ఆయన పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకునేవారు. చదువుకొనడానికి, ఆర్థిక స్తోమత లేనిపిల్లలకు ధనసహాయము, రోగపీడితులైన వాళ్లకు వైద్యసహాయము కల్పించడం, ఆ ధనిక కుటుంబానికి ఉదాత్తమైన అలవాటు. ఆ ఊళ్ళో జరిగే ప్రతి వివాహానికీ, శుభకార్యాలకీ, ఉత్సవాలకీ సమరేంద్ర ప్రతాపరావు కుటుంబం నుంచి సహాయ సహకారాలు తప్పకుండా లభించేవి. పేదవారి ఇళ్ళల్లో చావులు సంభవిస్తే మృతుని కుటుంబ సభ్యులు, సమరేంద్రుడి ఇంటికి వెళ్ళి సహాయమడగక్కరలేదు. సమరేంద్రుడి అనుచరులే వెతుక్కుని మరీ వాళ్ళ ఇళ్ళకివెళ్ళి కావలసిన సహాయమందించేవాళ్ళు. ఆ విధంగా ప్రత్యక్షదైవాలుగా ఆ కుటుంబ పెద్దలు వ్యవహరించే వాళ్ళు.

తరతరాలుగా, ఆ కుటుంబంలో పరిమిత సంతానమే. ఒక్కొక్క కుటుంబ పెద్దకు ఒక్కరో ఇద్దరో పిల్లలు. చిన్న కుటుంబమే చింతలు లేని కుటుంబం అనే సత్యాన్ని అర్థం చేసుకుని, వాళ్ళు సంతాన సంఖ్యని పరిమితం చేసుకున్నారేమో! సమరేంద్ర ప్రతాపుడి తండ్రి, ఏడు సంవత్సరాల క్రితమే, కాలం చేశారు. ప్రస్తుతం, సమరేంద్రుడికి నలభై అయిదు దాటింది. వారి ఏకైక సంతానమైన వీరేంద్ర ప్రతాపుడికి పదిహేనేళ్లు. అతను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. సమరేంద్రుడి, ఒక్కొగానొక్క చెల్లెలు సుకన్య. ఒక ఫ్యాక్టరీ యజమానియైన భర్తతో బెంగుళూరులో ఉంటోంది. ముప్ఫై మూడేళ్ల వయస్సున సుకన్యకు ఎనిమిది, ఆరు సంవత్సరాల వయస్సున్న కూతుళ్ళు ఉన్నారు. పెళ్ళి అయిన వెంటనే, సుకన్య బెంగుళూరుకు వెళ్ళవలసి వచ్చింది. ఎందుకంటే, ఆమె భర్త అయిన రఘురామ ప్రసాద్ తండ్రి స్వస్తలమైన అనంతపూర్ వదిలి బెంగుళూరు వెళ్ళి అక్కడ రెండు కంపెనీలు స్థాపించి ఎంతో కాలమైంది. ఆకారణంగా, రఘురాముడు, అతని తమ్ముడు, చెల్లెలు పెరగడం, చదవడం అంతా బెంగుళూరులోనే జరిగింది. కానీ, వాళ్ళందరూ ఇంట్లో మాతృభాషయైన తెలుగులోనే మాట్లాడుకుంటారు. ఆ ముగ్గురూ తెలుగు సెకండ్ లాంగ్వేజీ ఉన్న స్కూల్లోనే చదువుకున్నారు. సుకన్య తన కూతుళ్ళిద్దరికీ తెలుగు చక్కగా నేర్పించడంలో ఎంతో శ్రద్ధ చూపించింది.

సుకన్య అత్తింటివారు, స్వస్థలమైన అనంతపూర్‌కి, ఆంధ్రరాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకి ఏవో పనుల మీద తిరుగుతుండేవారు. బంధుమిత్రుల్ని అప్పుడప్పుడు వెళ్ళి కలవడం వాళ్ళకి సరదా. రఘురాముని తండ్రి అనంతపూర్‌లో పెద్ద కుటుంబానికి చెందిన వ్యక్తి కాబట్టి, రాష్ట్రేతర ఆంధ్రుడు అని అనిపించుకోవడం ఇష్టం లేక కుటుంబ సమేతంగా, ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కువ కాలం పర్యటిస్తూ ఉండేవారు. ఆ విధంగా, చాలమందితో సత్సంబంధాలు పెంచుకోవడం వలనే, రఘురాముడికి, కళ్యాణగిరి నాయకుడి సుపుత్రికతో పాణిగ్రహణ సద్భాగ్యం కలిగింది. బెంగుళూరులో సుకన్య భర్త, అత్తామామలతో ఎంతో సుఖసంతోషాలతో రోజులు గడుపుతోంది. సుకన్య-రఘురాములు సంవత్సరానికి కనీసం ఒకసారి కళ్యాణగిరికి వెళ్ళి, అక్కడ మూడు, నాలుగు రోజులు గడిపేవారు.

పిల్లలకు స్కూలు శలవులు కాబట్టి, ఈసారి కాస్త ఎక్కువ రోజులు కళ్యాణగిరిలో గడపాలని అనుకునే, సుకన్య దంపతులు వచ్చారు.

రఘురామునికి, ఆ గ్రామవాతావరణం అంటే ఎంతో ఇష్టం. బెంగుళూరు నగరంలో కనబడని, పచ్చని చేల మధ్య గట్టుపైన నడిచి వెళ్ళటం ఆయనికి ఎంతో ఆహ్లాదం కలిగించేది. అతను ఆ ఊళ్లో ఎటు వెళ్ళినా, సమరేంద్రరావుగారి పాలేరు యాదగిరి కూడా వెంట

వెళ్ళేవాడు. రఘురాముడు ఆ ఊళ్ళో ఎక్కడికివెళ్ళినా, ఊరి జనం వంగి, వంగి దండాలు పెడుతుంటే అతనికి ఆ గ్రామానికి తనే రాజేమోననే భ్రమ కలిగేది.

శీతాకాలపు సాయంకాలపు వేళలో, అది కూడా మూడు, నాలుగు గంటల ప్రాంతంలో నులివెచ్చని ఎండలో ప్రకృతి రమణీయతని ఆస్వాదిస్తూ నడవడం, ఎవరికయినా ఆహ్లాదకరమే. ఆ రోజు రఘురాముడు, తన హనుమంతుడైన యాదగిరితో పాటు, అలా నడుస్తున్నాడు. యాదృచ్ఛికంగా, ఆ దృశ్యం రఘురాముడి కంటికెమేరాలో కేంద్రీకృతమైంది. నల్లగా ఉన్నా కూడా, మిసమిసలాడే ఒక యువతి చేల మధ్య నీటిగుంటలో నిలబడి బట్టలు ఉతుకుతోంది. కాళ్ళు, మోకాళ్ళ వరకూ నీటిలో మునిగి ఉన్నాయి. నడుము దిగువ భాగాన్ని ఆచ్ఛాదించవలసిన వస్త్రం నీటికి భయపడి పైకి ఎగబాకుతున్నట్లుగా ఉండటం వలన, యవ్వనం తొణికిసలాడుతున్న ఊరువులు సగానికిపైగా బయటికి కనిపిస్తున్నాయి. ఆ ఉతుకుడు బండమీద బట్టలు బాదుతున్న సగం కన్నా ఎక్కువగా అనాచ్ఛాదితమైన ఆమె ఎద భాగం, రా రమ్మని సౌంజ్ఞ చేస్తోందా? ఊగుతూ పిలుస్తోందా? ఊయలలాడుతూ తనని వెక్కిరిస్తోందా? లేదా పూనకంతో గంతులేస్తూ పిలుస్తోందా? అని రఘురాముడికి నిశ్శబ్దంగా గుండెదడ మొదలైంది. ఆమె కాళ్ళూ, చేతుల కదలికలు, ఆమె ఆరోగ్య సంపదనీ, చురుకుదనాన్నీ వ్యక్తం చేస్తున్నాయి. ఆమె ఉదరోపరి భాగం, అతని మనసుని, చేతుల్ని ఉవ్విళ్ళూరింపచేస్తోంది. ఆమె ముఖం నీటిగుంటలో ఒక పెద్ద తొడిమెలో నుంచి వికసిస్తున్న కమలంలా ఉంది.

ఒక కారడవి మధ్యలో బార్ అండ్ రెస్టారెంట్ కనబడినట్టు రఘురాముడు అలా నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

"ఒరేయ్ యాదగిరీ! ఈ పిల్ల ఎవర్రా?"

"ఏం దొరా! చూస్తేనే తెలుస్తోంది కదా! ఆమె ఒక చాకలిపిల్ల అని. పేరు శాంతమ్మ."

"ఈ ఊరేనా?"

"ప్రక్క ఊరిదైతే, మన చేల్లో గుంటల్లో, గుడ్డలుతుకుతుందా, దొరా?"

"నాకు బాగా నచ్చింది."

"ఈ ఊళ్ళో అందరికి ఆమె అంటే ఇష్టమే. ఎంతో మంచిపిల్ల. మామూలు ఆడవాళ్ళలాగా, ఇరుగమ్మలు పొరుగమ్మలతో ఊసులుకానీ, కొట్లాటలు కానీ ఆమెకు సరిపడవు."

"పెద్దల మాట వింటుందా?"

"అయ్యా! పెద్దలంటే ఆమెకి ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయి. ఆమె పొగరుమోతూ కాదు, తుంటరీ కాదు. నెమ్మదయిన పిల్ల."

"నేను పిలిచిన చోటికి వస్తుందా?"

"ఈమె పెనిమిటి, అత్తమామలే కదా, దొరగారి ఇంటి చాకళ్ళు. అందుకే, అప్పుడప్పుడూ ఈమె కూడా వస్తుంది."

"అయితే నీకు చాల పరిచయముందన్నమాటే. ఒకసారి నన్ను కలవమను. డబ్బెంత కావాలన్నా ఇస్తాను. కానీ, పని జరగాలి సుమా!"

"అయ్యో దొరా! నువ్విలా మాట్లాడతావని అనుకోలేదు. ఈ ఊళ్ళో ఎవరూ బయటి ఆడవాళ్ళని అలా చూడదు. పెద్ద దొరకి తెలిస్తే మాత్రం ఊళ్ళోంచే వెలేస్తారు."

"ఒరేయ్, యాదగిరీ! నీ పెద్దదొర చట్టాలు నాకు వర్తించవు. నేను ఈ ఊరివాణ్ణి కాదు కదా! మాది బెంగుళూరు కదా!"

"అది నిజమే దొరా! కానీ, బెంగుళూరు వాళ్ళయినా, మద్రాసు వాళ్ళయినా, వాళ్ళ ఊళ్ళో అలాంటి పనులు చేస్తే చెల్లుతుంది. కానీ, మా కళ్యాణగిరిలో అటువంటి తప్పుడు పనులు చేస్తే పుచ్చెలెగిరిపోతాయి. అదే, ఈ ఊరి గొప్పతనం."

"యాదగిరీ! ఈ కథల్తో నాకు పనిలేదు. నీ పెద్ద దొరకి భయపడాల్సిన పని అంతకన్నా లేదు. ఈ అమ్మాయిని చూసి పరవశించి పోయాను. ఒక్కసారామె నా దగ్గరికి రావలసిందే. నువ్వెళ్ళి ఒకసారి ఆమెతో మాట్లాడిరా."

"దొరా! నేనీ ఊళ్ళోఉండాలా? వద్దా?"

"అంతదాకా వస్తే, నిన్నూ నీ కుటుంబాన్ని బెంగుళూరుకి తీసుకువెళతాను. నీకు, నా ఫ్యాక్టరీలో ఒక మంచి ఉద్యోగం ఇస్తాను. వెళ్ళి అడిగిరా"

"వద్దు దొరా! వద్దు. ఇది చాలా సిగ్గుచేటుపని. మనకొద్దుదొరా!"

"ఛీ!ఛీ! నీక్కూడా కావాలని కాదు, నిన్నడగమని చెప్పేది. నాకు కావాలి.... కావాలి. కావాలి... నాకు ఎక్కువగా కోపం తెప్పించకవెళ్ళి అడగరా, గాడిదా!"

చిన్నదొర అలాకోపంతో మండిపడటం చూసి, యాదగిరికి గత్యంతరం లేదని అర్థమైంది.

సంకోచిస్తూ, సంకోచిస్తూ, తటపటాయిస్తూ, తటపటాయిస్తూ అతను శాంతమ్మ దగ్గరికి వెళ్ళి తన చిన్నదొర రోగం గురించి చెప్పాడు. వెంటనే, ఆమె అప్పటి వరకూ ఉతికిన బట్టలు, ఉతకని బట్టలు, అన్నింటినీ మూటకట్టి భుజాన వేసుకుని గబగబా అక్కడినుంచి పరుగెత్తిపారిపోయింది. చేతిలోని గింజ చేజారి నీటిలో పడిపోయిన ఉడుతలాగా, విషణ్ణ వదనంతో యాదగిరి తన దొర దగ్గరికి వెళ్ళి ఇలా చెప్పాడు, "అయ్యయ్యో దొరా! అంతా గందరగోళమై పోయింది. ఈ విషయం పెద్దదొర వరకూ వెళితే ఏమవుతుందో!"

"ఒరేయ్ యాదగిరీ! నీ పెద్ద దొరేమన్నా ఈ ఊరికి నిజాము ప్రభువా? లేకపోతే మహారాజా? ఎవరి తలైనా సరే నరికే అధికారం అతనికుందా? పైగా, ఇది నీక్కూడా తెలిసిన విషయమే కదా! ఏ ఆడది అడిగిన వెంటనే ఒప్పుకుంటుంది? కానీ, నువ్వు పట్టు వదలద్దు. మూడు, నాలుగు సార్లు వెళ్ళి అడిగితే, ఆమే కాదు, ఆమె అమ్మమ్మ అయినా సరే ఒప్పుకుంటుంది. ఎలాగైనా సరే, ఆమెని నా దగ్గరకు తీసుకురావడం నీ బాధ్యత."

మర్నాటి ఉదయం ఏడుగంటలకు, శాంతమ్మ భర్త, అతని తండ్రి, సమరేంద్రప్రతాప్ బంగ్లాకి వచ్చి తమ ధర్మసంకట పరిస్థితిని గురించి మనవి చేసుకున్నారు. చిన్నదొరని ధిక్కరించడం తమ వల్లకాదని, అంతేకాక శాంతమ్మ శీలరక్షణ చేయడం తమ ధర్మమని, అందువల్లనే తాము ఊరు వదిలి వెళ్ళాలని నిశ్చయించుకున్నామని వాళ్ళు చెప్పారు. సమరేంధ్ర ప్రతాపరావు రఘురాముణ్ణి రమ్మని కబురంపించారు.

"రఘురామా!... ఇతను కోటయ్య. అతను కోటయ్య కొడుకు నారాయణుడు. చెప్పడానికి ఎంతో ఇబ్బందికరమైన విషయమైనా, కోటయ్య సందేహిస్తూ, సందేహిస్తూనే నాతో ఒక విషయం చెప్పాడు."

రఘురాముడికి తల తిరిగినంత పని అయ్యింది. ముందు రోజు జరిగిన దానికి ప్రత్యాఘాతాలెన్ని తగలబోతున్నాయోనని ఆలోచించి అతనికి వణుకు పుట్టింది. కానీ, సమరేంద్రప్రతాపుడు ఎంతో శాంతస్వరంతో చెప్పుకుపోయాడు. "ఈ విషయం గురించి మాట్లాడటం నాకూ సంకోచంగానే ఉంది. కానీ, తరతరాలుగా మా కుటుంబానికి వీళ్ళు ఎంతో భయభక్తులతో, ఆత్మార్థతతో సేవ చేస్తున్నారు. అందుకు ప్రతిఫలంగా, కోటయ్య కుటుంబానికి మనం ఎంతచేసినా తక్కువే. ఈ నారాయణుడికి ఒక పెద్ద కోరిక పుట్టుకొచ్చింది. ఆ విషయమై మాట్లాడ్డానికి అతనికి ధైర్యం చాలట్లేదు. అతని తండ్రికి కూడా, ఆ విషయం మా ముందు ప్రస్తావించే గుండె ధైర్యం లేదు. కానీ, పాపం నారాయణుడు ఆ మోహాగ్నిలో దహించుకుపోతున్నాడు."

రఘురాముడికి ఏమీ అర్థం కాలేదు. ముందురోజు, పూర్వాపరాలు ఆలోచించకుండా తను చేసిన పని గురించి కాదుకదా ఈ ప్రస్తావన!

సమరేంద్రప్రతాపుడు, ఆగకుండా తన మాటలు కొనసాగించాడు. “మామూలుగా, ఎవ్వరూ అంగీకరించని మనవి కాబట్టి, ఆ విషయం మీతో చర్చిద్దామని అనుకున్నాను. ఈ విషయంలో ఒక నిర్ణయం తీసుకోవలసింది మీరే. మీ తీర్పు ఏదయినా మాకు సమ్మతమే. నిజానికి. నాకు ఆ సంగతి చెప్పడం ఇష్టం లేకపోయినా, నారాయణుడికి అతి తీవ్రమైన కోరిక గురించి చెప్పమంటారా?”

రఘురాముడు ఎంతో పరిభ్రాంతితో విషయమేమిటని అడిగాడు కోటయ్య నారాయణుడు పెద్దదొరగారి ఉద్దేశ్యమేమిటయి వుంటుందా అని కంగారు పడుతున్నారు. సమరేంద్రుడు బాగా గొంతు తగ్గించి, “ఈ నారాయణుడికి చాలాకాలం నుంచీ మా సుకన్య ముఖం పరిచితమే. కానీ, ఈసారి మీరు ఇక్కడికి వచ్చిన తరువాత సుకన్యను చూసి, అతని మనసులో ఒక మహామోహం మొలకెత్తింది. కేవలం ఒక్క రాత్రికి, ఆమెను అతని దగ్గరికి పంపిస్తారా, అని భయపడుతూ అతను అడుగుతున్నాడు. “రఘురాముడు, తను అగ్గి గుగ్గిలమై పోతానేమోనని భయపడి, గబగబా లోపలికి వెళ్ళిపోయాడు. నారాయణుడు సమరేంద్రప్రతాపుడి పాదాల మీదపడి ఏడవటం మొదలు పెట్టాడు. కోటయ్యకి నోరు పెగలని పరిస్థితి వచ్చినా, మాట్లాడకుండా ఉండలేకపోయాడు.

“పెద్ద దొరగారికి, ఏ మాటయినా అనడానికి అధికారముంది. కానీ, చిన్నమ్మ గురించి ఇలా చెప్పడంతో మా గుండెలు పగిలిపోతున్నాయి. వీడు, అలా మనసులో అనుకున్నా, వీణ్ణి రెండు ముక్కలుగా తెగేస్తాను.”

“అలాంటి ఘోరపాతకం గురించి ఈ జన్మలోనే కాదు, పది జన్మల తరువాత అయినా ఆలోచిస్తానా? చిన్నమ్మ గారిని, నా స్వంత తల్లికంటే ఎక్కువగా నేను గౌరవిస్తున్నాను. ఆమె నా తల్లితో మాత్రమే సమానం గాదు, దైవం కూడాను. ఆ దైవం వైపు నేను కన్నెత్తయినా చూడను. అలా చూస్తే, నా కళ్ళు పేలిపోవలసిందే. చిన్నమ్మగారితో నేను మాట్లాడేటప్పుడు, ఎప్పుడూ ఆమె పాదాలవైపే చూస్తుంటాను. ఆమె నడిచిన నేలని తాకే అర్హత కూడా నాకు లేదు.” అని చెబుతూ నారాయణుడు భోరన ఏడ్చాడు.

సమరేంద్రుడు వాళ్ళిద్దరిని ఓదార్చాడు. “మీరు అలా ఏడవకండి. నేనిలా అనకూడని ఒక విషయం అనడం, మిమ్మల్ని బాధపెట్టాలనే ఉద్దేశ్యంతో కాదు. నగరంలో పుట్టి పెరిగిన రఘురాముడికి ఇలాంటి ఒక దెబ్బ తగిలితేనే, అతను చేసిన తప్పు గురించి కాస్త అయినా

అపరాధభావం కలుగుతుంది. మీరు కూడా మనుషులేనని, మీకూ మానాభిమానాలుంటాయని అతనికి తెలియజేయాలి కదా. అతను ఇక ముందెన్నడూ శాంతమ్మవైపు అలా చూడనే చూడడు. నేను సుకన్య గురించి అతనితో అలా అడగటం మహాపాపమే. కానీ, ఆమె అతని భార్య అయ్యేముందే, ప్రాణానికి ప్రాణమైన నా చెల్లెలు. ఆమెని నొప్పించాలని కానీ, అవమానపరచలని కానీ, నేను కలలో కూడా ఆలోచించలేదు. మరెవరూ ఆమెని అవమానించడం కూడా నేను సహించలేను. ఇప్పుడు రఘురాముడు లోపలికెళ్ళి సుకన్యతో రచ్చ చేస్తున్నాడేమో కానీ, ఆమె నా చెల్లెలే కదా! నేను చెపితే అర్థం చేసుకుంటుంది. ఈ గ్రామంలో అన్యాయం జరక్కుండా చూడ్డం నాదే కాదు, నా యావత్ కుటుంబానికీ చెందిన బాధ్యత, ధర్మమూ, ఈ ఊరొదిలిపోవాల్సిన ఖర్మ మీకెప్పుడూ రాదు. మీరలా అనుకోవడమే తప్పు. ఈ ఊరు మీది. ఇదే మీ తల్లి. మీ తల్లిని వదిలి మీరెప్పుడయినా వెళ్ళిపోగలరా?"

"లేదు, లేదు." అని చెబుతూ, అతని కాళ్ళు రెండూ గట్టిగా పట్టుకొని ఏడ్చిన కోటయ్య, నారాయణులు అపరాధభావంతో పగిలిపోతున్న హృదయాలతో, తడబడుతున్న అడుగులతో మెల్లమెల్లగా అక్కణ్ణించి కదిలి వెళ్ళిపోయారు.

అనంతరం, ఆ ఇంట్లో ఆ రోజు కలిగిన పరిణామాలు, సమరేంద్రప్రతాపుడు ఊహించినట్లుగా లేవు. ఇంకో అరగంట లోపల రఘురాముడు, సుకన్య వారి పిల్లలూ ఆ ఊరొదిలి వెళ్ళిపోయారు. చెల్లాయిని సముదాయించడానికి ఆ అనురాగమూర్తియైన సోదరుడు ఎంతగా ప్రయత్నించినప్పటికీ, తన భర్తకి నేర్పించడం కోసం, తక్కువ వాళ్ళముందు తన పేరుని నింద్యపరచడాన్ని సుకన్య వ్యతిరేకత వ్యక్తపరిచింది.

తరువాత పది సంవత్సరాలదాకా, సుకన్యా, రఘురాముడు, పిల్లలూ, ఆ గ్రామంవైపు చూడలేదు. టెలిఫోన్ల ద్వారా, ఉత్తరాల ద్వారా ఆ అన్నాచెల్లెళ్ళు తమ క్షేమ సమాచారాలు తెలియజేసుకునేవాళ్ళు. కానీ, ఆ దశాబ్దం పూర్తి అవడంతోనే, వాళ్ళు కళ్యాణగిరికి రాక తప్పలేదు.... యాభై అయిదేళ్ళ సమరేంద్రప్రతాపుడు, గుండెపోటుతో చనిపోవడం వలన.

తన బావగారి ముఖాన్ని మరిక జన్మలో చూడనని ఉగ్రశపథం చేసిన ఒకే మాట - ఒకే బాణం - ఒకే భార్య అనే లక్షణాలున్న రఘురాముడికి, సమరేంద్రుడి శాంత గంభీరమైన వదనాన్ని ఒక్కసారి చూడక తప్పలేదు. కళ్ళు చెమరిస్తూ ఉండగా, అతని మస్తిష్కం ఇలా మంత్రించింది. "మహానుభావుడు!"